క్లుప్తంగా

జేఎన్‌టీయూ జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం: స్థానిక ఆర్‌జీఎం కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 31న కుప్పంలో జరిగిన ఎంపిక పోటీల్లో తమ కళాశాలకు చెందిన రాంజీ, శ్రీనాథ్‌రెడ్డి ఫుట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ క్రీడలకు ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెల కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ స్థాయి ఫుట్‌బాల్ క్రీడల్లో జేఎన్‌టీయూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఇందుకు కృషి చేసిన పీడీ వెంకటేష్‌ను అభినందించారు.

4న అభయాంజినేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో ఈనెల 3, 4వ తేదీల్లో అభయాంజినేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 3న గణపతిపూజ, పుణ్యవాయనం, జలాధివాసం తదితర పూజలు, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు. 4న ప్రాతఃకాల పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై నివేదికలు ఇవ్వండి

సి.బెళగల్: మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికలను ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన మండల స్థాయి అధికారులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి, శాఖల పరంగా నివేదికలను గురువారం ఉదయం 11 గంటలలోగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు.

వీఎస్‌ఏకు వీఏగా పదోన్నతి



బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి ఆర్బీకేలో గ్రామ పశు సంక్షేమ సహాయకులు (వీఎస్‌ఏ)గా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణకు పశువైద్యశాల సహాయకుడి (వీఏ)గా పదోన్నతి లభించింది. వీఏగా పదోన్నతి పొందిన రామకృష్ణ మండలంలోని కొత్తకోట పశు వైద్యశాల సహాయకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కొత్తకోట పశు వైద్యశాలలో డాక్టర్ సుంకన్న ఆధ్వర్యంలో వీఏగా రామకృష్ణ బాధ్యతలను స్వీకరించారు. పదోన్నతి పొందిన రామకృష్ణకు సచివాలయ ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కొరటమద్దిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గడివేముల: మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో గురువారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సమస్యలతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకుంటారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేసీ కెనాల్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు నీటి విడుదల కొనసాగుతుంది. బుధవారం కేసీకి 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డ్యాం జేఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో లేదని, 0.507 టీఎంసీ నీరు నిల్వ ఉందని చెప్పారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలు హెప్సీబాను సన్మానిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్ : మండల పరిధిలోని జూలకల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేసిన హెప్సీబాకు పదోన్నతి లభించడంతో బుధవారం హెచ్‌ఎం అయ్యన్న, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మారెప్ప ఆధ్వర్యంలో జిల్లా నోడల్ అధికారి ధన్‌రాజు, ఉపాధ్యాయులు హుసేనయ్య, దేవిక సన్మానించారు. మారెప్ప మాట్లాడుతూ 2021 నుంచి 2023 జూన్ వరకు జూలకల్‌లో ఉపాధ్యాయురాలుగా పని చేసి పదోన్నతిపై వేముగోడు, తరువాత తెర్నేకల్ ఉన్నత పాఠశాలకు వెళ్లడం జరిగిందన్నారు.

వైఎస్ జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- పండుగ వాతావరణంలో సచివాలయాల ప్రారంభోత్సవం





పర్ల గ్రామంలో సచివాలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం-1, సచివాలయం-2 భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల చెంతకే పాలన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి సచివాలయంలో అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులను నియమించామన్నారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల సేవలను గ్రామ సచివాలయంలోనే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో అవినీతి రహితంగా సుపరిపాలన అందిస్తున్న, మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ బోయ శారద, సర్పంచ్ హనుమక్క, ఎంపీటీసీ అశోక్‌వర్ధన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సుంకన్న, హరి, నరసింహులు, శేఖర్‌రెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు తదతరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని ప్రజలు విన్నవించారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకాల ఎంపికలో మధ్యవర్తుల ప్రమేయం, అవినీతికి అస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నామన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు, రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న పేదల అభ్యున్నతి కోసం పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

గూడూరు రూరల్ : 2024 మార్చిలో జరగబోవు పదో తరగతి పరీక్షల ఫీజును ఈ నెల 10వ తేదీలోపు విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించాలని గూడూరు బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు రూ. 50, 17 నుంచి 22 వరకు రూ. 200, 23 నుంచి 30 వరకు రూ.500 అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతేడాది పదిలో ఫెయిల్ అయిన వారు కూడా నిర్ణీత గడువులోగా ఫీజులు చెల్లించాలని తెలిపారు.

పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కల్లూరు: ఈ నెల 3వ తేదీన 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి సూచించారు. బుధవారం కల్లూరు మండలంలో ఎంపిక చేయబడిన 47 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 76 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు బ్లాక్ లెవెల్ కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించే ఎంఈఓలు పరీక్ష నియమాలు, విధి విధానాలను స్పష్టంగా వివరించారు. సమగ్ర శిక్ష ఏఎంఓ ప్రసాద్, ప్రభుత్వ వీఈడీ కళాశాలల అధ్యాపకులు డాక్టర్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం



ఒండుట్లలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రావు

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గని, ఒండుట్ల, ఎల్‌కే తండా, పైబోగుల గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 18,516 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారన్నారు. సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ బుకింగ్ చేశారని, సామాజిక తనిఖీ కొరకు రైతుభరోసా కేంద్రంలో జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. ప్రస్తుత పంటల స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం



గులాబి తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఉపాధి హామీ కింద సాగు చేసిన రోజా, మల్లె తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన రైతులకు పూలు, పండ్ల తోటలు, కూరగాయల సాగు చేసుకునేందుకు నిర్వహణ ఖర్చులు అందిస్తున్నామన్నారు. తోటల నిర్వహణ ఖర్చులు రెండు సంవత్సరాల వరకు అందుతాయని చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కును బాధితుడికి అందజేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, నాయకులు

కోడుమూరు రూరల్ : పట్టణంలోని పెద్ద బోయవీధికి చెందిన బచ్చగిడ్డయ్య అనే దివ్యాంగుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అందజేశారు. తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానంటూ దివ్యాంగుడు బచ్చగిడ్డయ్య గత నెల నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించాడు. దీంతో బచ్చ గిడ్డయ్యను ఆర్థికంగా ఆదుకునేందుకు కోట్ల హర్షవర్దన్‌రెడ్డి సీఎం సహాయ నిధికి ప్రతిపాదించగా, రూ.50వేలు మంజూరైంది. ఈ మేరకు చెక్కును బుధవారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ ఉపసర్పంచు మాదులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు తేనేశ్వరరెడ్డి, డిష్ రవి, రాఘవేంద్ర, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



కోడుమూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కోడుమూరు రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘన నివాళి అర్పించారు. బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆశయాలను, సేవలను కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యుగంధర్ శెట్టి, పట్టణాధ్యక్షుడు కలికి నాగరాజు, నాయకులు సుధాకర్, కిరణ్‌కుమార్, కృష్ణమూర్తి, మయూరి రమేష్, రమణయ్య, అశోక్, కిశోర్, మల్లికార్జున, నారాయణ, గణేష్ తదితరులున్నారు.



ప్యాలకుర్తిలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్



గడిగరేవులలో ఆవుల సుబ్బరాయుడుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఆదిలక్ష్మి



చిన్నటేకూరులో కె.సాయిబాబాకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ చంద్రశేఖర్

ఊరూరా పింఛన్ల పండుగ



లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నగేష్

కోడుమూరు రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా మండలంలో లబ్ధిదారులందరికీ పింఛన్లు సకాలంలో అందజేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ పర్యటించి గ్రామ సచివాలయాలను తనిఖీ చేయడంతో పాటు, పింఛన్ల పంపిణీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కోడుమూరు మండలంలో 9,043 మంది పింఛనుదారులుండగా బుధవారం తొలిరోజు 5,862 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ల సొమ్మును అందజేశారని, మిగిలిన లబ్ధిదారులందరికి కూడా త్వరితగతిన పింఛన్లను సిబ్బంది అందజేస్తారన్నారు.

గడివేముల: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో వలంటీర్లు సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందించారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 5,834 పింఛనుదారులకు గాను తొలిరోజు 3,197 మందికి పింఛన్లు పంపిణీ చేసి 54.8 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. లబ్ధిదారుల ఉన్న చోటికే వెళ్లి వలంటీర్లు పింఛన్ సొమ్మును అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

కల్లూరు: నెల మొదటి రోజు కావడంతో గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. బుధవారం ఉదయమే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్‌దారుల నుంచి వేలిముద్రలు నమోదు చేసుకుని పింఛన్లు అందించారు. మండలంలో 8,407 మంది పింఛన్‌దారులు ఉండగా మొదటి రోజు 4,569 (54 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో వలంటీర్ల ద్వారా బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తొలిరోజు రాత్రి 8 గంటల సమయానికి 73 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలలో భాగంగా అర్హులన లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలో వేర్వేరు కేటగిరీలలో కలిపి మొత్తం 7,803 పింఛన్లకుగాను తొలిరోజునే 5,762 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లను అందజేసినట్లు పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- 29వ వార్డులో రూ.40 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ



పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: కర్నూలు నగరంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులో ఎస్‌ఎస్‌ఆర్ నగర్, సొసైటీ కాలనీ, హనుమాన్ టెంపుల్ లైన్ ప్రాంతాలకు తాగు నీరు అందించేందుకు రూ.40 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ముఖ్య అతిథులుగా హాజరై పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పరిధి రోజురోజుకు విస్తరిస్తుడడంతో అందుకు అనుగుణంగా తాగునీరుతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరంలో అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా పాలక వర్గం పని చేస్తోందన్నారు. పాలక వర్గం ఏర్పడ్డాక రెండేళ్ల కాలంలో 65 ఎంఎల్‌డీ సామర్థ్యాలు గల రెండు నీటిశుద్ధి కేంద్రాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే మునగాలపాడు 15 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్రాజెక్టు పూర్తవ్వగా, రూ.130 కోట్లతో జగన్నాథ గట్టు మీద 50 ఎంఎల్‌డీల సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాల చంద్రారెడ్డి, సాయి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- కొత్తపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కొత్తపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి అవసరమైన ప్రతి పాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఎమ్మెల్యే మండల అధికారులను ఆదేశించారు.

కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇప్పించాలంటూ మొర..

గ్రామంలో తాము ఎన్నో ఏళ్ల నుంచి జీవిస్తున్నా.. అధికారులు కుల సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నామని, తమ పిల్లలకు చదువులకు ఇబ్బందిగా ఉందంటూ అరెమరాఠి కులస్తులు లక్ష్మీ, సుమన్ బాయి, నాగమ్మ, వెంకప్ప, వెంకటేశ్వర్లు, రాముడులు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌తో మొరపెట్టుకున్నారు. సమస్యను జిల్లా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు బాలకృష్ణ, ఉప సర్పంచు చిన్న రాముడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, నాయకులు రాజశేఖరరెడ్డి, బాలమద్దిలేటి, చిన్న మద్దిలేటి, లక్ష్మన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

మంచాలకట్టలో అగ్ని ప్రమాదం

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా, గేదెలు తీవ్ర గాయాలపాలయ్యాయి. గ్రామానికి చెందిన సుద్దుల నడిపి లక్ష్మయ్యకు చెందిన పశువుల కొట్టంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న మంటల్లో చిక్కుకొని గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఘటనలో రూ. లక్ష విలువ చేసే గేదెలు తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఫ్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి

- గాల్లోకి బెలూన్లు వదిలిన కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్, కేడీసీసీ చైర్‌పర్సన్



లైట్ ఫర్ ఆక్వా కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్, అతిథులు

కర్నూలు (టౌన్): ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నగరంలోని రావూరి గార్డెన్స్‌లో నిర్వహించనున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం రాత్రి స్థానిక బిర్లా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న ఖానా ఖజానా వేదికగా గాల్లోకి బెలూన్లు వదిలి లైట్ ఫర్ ఆక్వా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రొయ్యలు, చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, మత్స్య శాఖ డీడీ శ్యామల, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను రక్తహీనత నుంచి కాపాడాలి



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు రక్తహీనతకు గురిగాకుండా కాపాడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని హౌసింగ్ బోర్డు సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి వారితో చర్చించారు. గర్భిణీలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్ ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. ఆశా కార్యకర్తలు వారి గృహ సందర్శనాల్లో హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ విజిట్స్ చేసి ఆ వివరాలను ఆశా యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాబుకు మధ్యంతర బెయిల్ రద్దు చేయాలి

కర్నూలు(లీగల్): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి జారీ చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడటంతో పాటు ర్యాలీ నిర్వహించారన్నారు. బెయిల్ కండీషన్లను ఉల్లంఘించినందుకు ఆయనపై హైకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, ప్రెసిడెంట్ పి.సువర్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ రాజేష్, స్టేట్ జాయింట్ సెక్రటరీ షాషావలి, న్యాయవాదులు సి.వి.రామ్‌ప్రసాద్, పల్లవి, రాజేంద్రారెడ్డి, అన్నపూర్ణారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసులు, యుగంధర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అనిల్‌కుమార్, శ్వేతబిందు, అర్షియా పర్వీన్ పాల్గొన్నారు.